పిప్రి కదిలేనా..!



పిప్రిలో నిలిచిపోయిన పంపుహౌస్ పనులు

- ఏడాదిగా నిలిచిన పనులు
- నిధులు, ఆయకట్టు తగ్గింపుతో అడ్డుకున్న రైతులు
- ఎత్తిపోతల పథకం నిర్మాణంపై నీలినీడలు

లోకేశ్వరం: నాలుగువేల ఎకరాలకు పైగా పంట భూములకు సాగు నీరందించాలనే లక్ష్యంతో పిప్రి గ్రామ సమీపంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం పనులు ముందుకు సాగడం లేదు. పనులు ప్రారంభించిన తర్వాత నిధులు తక్కువగా మంజూరు కావడంతో అధికారులు ఆయకట్టు ప్రాంతాన్ని తగ్గించారు. దీంతో ఆగ్రహించిన పిప్రి గ్రామ రైతులు 2023, మేలో పనులను అడ్డుకున్నారు. అప్పటి నుంచి పనులు సాగకపోవడంతో పిప్రి ఎత్తిపోతల పథకం పరిధిలోని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

రూ. 59 కోట్లు మంజూరు..

గోదావరి నది నుంచి నీటిని ఎత్తిపోసి మండల పరిధిలోని సాగు భూములను సస్యశ్యామలం చేసేందుకు గత ప్రభుత్వం 2023లో పిప్రి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పిప్రి గ్రామ సమీపంలోని గోదావరి నది నుంచి 3 కి.మీ ఇన్‌టేక్ లైన్, ఇన్‌టేక్ బావి, 8 గ్రామాల ఆయకట్టుకు 36 కిలోమీటర్ల మేర పైపులైన్‌ను కోసం మొత్తం రూ.79 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కాగా గతేడాది ప్రభుత్వం రూ.59 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఇన్‌టేక్ బావి, ఇన్‌టేక్ లైన్, విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణంతో పాటు 11 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో 25 కిలోమీటర్ల పైపులైను నిర్మాణం ఆగిపోయి మొత్తం 4214 ఎకరాల ఆయకట్టులో కేవలం 1500 ఎకరాలకు మాత్రమే నీరందే వీలుంది.

పనులు అడ్డుకున్న రైతులు

పిప్రి గ్రామ సమీపంలోనే పథకం నిర్మిస్తున్న అధికారులు ఆ గ్రామానికి చెందిన 250 ఎకరాలకు సాగు నీరందేలా సర్వే చేశారు. అయితే ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించిన తర్వాత రూ.20 కోట్ల నిధులు తగ్గడంతో రైతులను సంప్రదించకుండానే కమిటీ వేసి ఆయకట్టు ప్రాంతాన్ని తగ్గించారు. దీంతో ఆగ్రహించిన రైతులు పనులు నిలిపివేశారు.

పిప్రి ఎత్తిపోతల పథకం వివరాలు..

గ్రామాలు	ఆయకట్టు ఎకరాల్లో
రాయపూర్‌కాండ్లీ	1,846
గొడిసెరా	306
మొహాళ,నగర్,బాగాపూర్	1,373
పిప్రి	250
ధర్మోర	177
మొత్తం	4,214



రాయపూర్‌కాండ్లీ శివారులో నిలిచిన పనులు

చివరి ఆయకట్టుకు నీరందించాలి



పిప్రి ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి. కనీసం రబీలోనైనా పంటలకు సాగు నీరందించాలి. నాలుగు నెలల కిందట పిప్రి గ్రామ రైతులు పనులు అడ్డుకున్నారు. రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసి చివరి ఆయకట్టుకు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, రాయపూర్‌కాండ్లీ

పనులు అడ్డుకున్నాం..



మా ఊరికి ఆయకట్టు ప్రాంతం తక్కువగా ఉంది. మాకు గొడిసెరా, నగర్, మొహాళ గ్రామాల శివారుల్లో భూములున్నాయి. మా భూముల గుండా పైపులైన్ వేసి ఎక్కడా కుండీలు నిర్మించలేదు. మావద్దే పంపుహౌస్ నిర్మించి, మా భూముల్లోనే పైపులు వేసి మాకే నీరందించడం లేదు. దీంతో పనులను అడ్డుకున్నాం. పిప్రి గ్రామ శివారు ప్రాంతంలోని భూములకు నీరందించాలి.

– రాజేశ్వర్, పిప్రి

సర్వే ప్రకారం నీరందిస్తాం

గతంలో చేసిన సర్వే ప్రకారం 4214 ఎకరాలకు నీరందేలా చర్యలు తీసుకుంటాం. మంజూరు చేసిన నిధులు సరిపోవని ఉన్నతాధికారులకు నివేదించాం. అదనంగా రూ.20 కోట్లు కావాలని ప్రతిపాదనలను అధికారులకు సమర్పించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. పిప్రి ఎత్తిపోతల పథకం పరిధిలోని చివరి ఆయకట్టు వరకు నీరందేలా చూస్తాం.

– అనిల్, భైంసా ఇరిగేషన్ డీఈ

మిత్రుని కుటుంబానికి చేయూత



రాచాపూర్‌లో బాండ్ అందిస్తున్న మిత్రులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన సాయన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98లో సాయన్నతో పదోతరగతి చదివిన అతడి మిత్రులు బాధిత కుటుంబానికి సాయం అందించాలని రూ.50వేలను జమ చేశారు. ఆ మొత్తాన్ని సాయన్న కుమార్తె పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి బాండ్‌ను ఆదివారం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు అశోక్, గోవర్ధన్, రమణ, రవీందర్, బండి శీలసాగర్, గుడిసె రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పశువుల వేలం



వేలం వేసే పశువులు



చాటింపు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని రహదారిపై సంచరించే పశువులకు సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని.. ఆసక్తి గలవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ విషయమై ఆదివారం మున్సిపల్ సిబ్బంది పట్టణంలో చాటింపు చేయించారు.

యువకుడి చొరవతో తొలగిన కష్టాలు



ట్రాక్టర్‌తో చదును చేయిస్తున్న వికాస్‌పటేల్

లోకేశ్వరం: మండలంలోని హథ్గాం గ్రామం నుంచి పంట చేన్లకు వెళ్లే పానాది రోడ్డు బురదమయంగా మారింది. ఆదివారం అదే గ్రామానికి చెందిన వికాస్ పటేల్ అనే యువకుడు సొంతంగా రూ.50 వేలు వెచ్చించారు. బురద రోడ్డుపై వంద ట్రిప్పుల మొరం పోయించి ట్రాక్టర్‌తో చదును చేయించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలిగిపోయాయి. అనంతరం గ్రామస్తులు యువకుడిని అభినందించి సన్మానించారు.

‘తీరనున్న నెట్‌వర్క్ సమస్య’

కుంటాల: గ్రామాల్లో సెల్ నెట్‌వర్క్ సమస్యలు దూరం కానున్నాయని బీజేపీ నాయకులు జీవీ.రమణారావు అన్నారు. ఆదివారం ఆయన కుంటాలలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని దౌనెల్లిలో సెల్ టవర్ ఏర్పాటు చేసి.. అంబుగామలో సెల్ టవర్ ప్రారంభించి సేవలందించాలని కోరుతూ ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచన మేరకు ఎంపీ నగేశ్ ఆధ్వర్యంలో ఇటీవల టెలికాంశాఖ కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు పే ర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు తాటి శివ, మాధవరావు, రాజు, రమేశ్, దత్తు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులతోపాటు తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కుంట ఏరియాలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 102 బైక్‌లు, 8 ఆటోలు, ఒక ఫోర్‌వీలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేరాల నియంత్రణ కో సమే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నామని పే ర్కొన్నారు. నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని మోసపోతే వెంటనే 1930కు డయల్ చేయాలని వివరించారు. పెండింగ్ చలాన్లు చెల్లించాలని అన్నారు. సీఐ డి.రాజారెడ్డి, ఎస్సైలు ఎండీ షరీఫ్, గౌసుద్దీన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

- ఎమ్మెల్యే బొజ్జుకు కృతజ్ఞతలు తెలిపిన లింగాపూర్ వాసులు

కడెం: మండలంలోని లింగాపూర్‌లోఉన్న శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను గ్రామస్తులు కోరా రు. స్పందించిన ఎమ్మెల్యే ఈనెల 2న దేవాదాయశాఖ మంత్రికి ఉత్తరం రాశారు. ఈనెల 10న దేవాదాయశాఖ కల్యాణ మండప నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జుకు, నాయకులు చంద్రశేఖర్, ఆకుల లచ్చన్న తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాథ్ శివాలయంలో ఆదివారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ప్రణీత్ మహరాజ్ చేతుల మీదుగా శ్రీ ఆదిశంకరాచార్య భగన్నామ సంకీర్తన, కుంకుమార్చన కార్యక్రమం సాగింది. ప్రణీత్ మహరాజ్ మాట్లాడుతూ శ్రావణమాసంలో పూజలు చేస్తే సంతాన ప్రాప్తి, విద్య అష్టఐశ్వర్యాలు పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నర్సారెడ్డి ఇటీవల అ నా రోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈ శ్వర్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

లింగి గ్రామానికి నిధులు మంజూరు



మంజూరు పత్రాలను గ్రామస్తులకు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: మండలంలోని పాతసాంవ్లి పంచాయతీ పరిధిలోని లింగి గ్రామంలో అభివృద్ధి పనుల కోసం రూ.10లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు భైంసా మండలం దేగాంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గ్రామస్తులకు నిధుల మంజూరు పత్రాలు అందించారు. గ్రామంలో నెలకొన్న నీటిసమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేకు విన్నవించగా.. ఆయన జిల్లా ఇన్‌చార్జి, మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి బోరుబావి, పైప్‌లైన్ ఏర్పాటుకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10లక్షలు మంజూరు చేయించారు. మాజీ సర్పంచ్‌లు ఎల్.సాయినాథ్, దత్తురాం పటేల్, రాజేశ్వర్ ఉన్నారు.

బురద రోడ్లపై వెళ్లేదెలా?

- అధ్వానంగా పంటపొలాలకు వెళ్లే బాటలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- రోడ్ల నిర్మాణం చేపట్టాలని వేడుకోలు



ఉమ్రి(కే) శివారులో పంట చేన్లకు వెళ్లే రోడ్డుపై దిగబడిన ఎడ్లబండి

తానూరు: ఏటా వర్షాకాలంలో మండలంలోని పలు గ్రామాల్లో పంట చేన్లకు వెళ్లే బండ్లబాట(పిల్ల రహదారి)లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో రైతులు పంటల వద్దకు వెళ్లి వచ్చేందుకు నానాపాట్లు పడుతున్నారు. ఇటీవలి వర్షాలకు బండ్లబాటలు బురదమయంగా మారాయి. మట్టిరోడ్లు కావడంతో అడుగు పెడితే మోకాళ్ల లోతు వరకు కాలు వెళ్తుంది.. ఎడ్లబండ్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చేతికొచ్చిన పంటలను సైతం ఇంటికి తీసుకురాకుండా చేన్లలోనే నిల్వ చేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధిహామీ పథకం కింద రోడ్ల నిర్మాణం చేపట్టాలని వేడుకుంటున్నారు.

మండలంలో..

తానూరు మండలంలో 31 పంచాయతీలుండగా వాటి పరిధిలో 36 గ్రామాలున్నాయి. మహలింగి, ఝరి(బి), బామ్ని, ఉమ్రి(కే), బోల్సా, భోసి, ఎల్వి, బెంబర, వడ్‌ఝరి, మసల్గా, మొగిలి గ్రామాల ప్రజలు తమ పంటపొలాలకు వెళ్లేందుకు ఏళ్ల కిందట బండ్లబాటలు ఏర్పాటు చేసుకున్నారు. నల్లమట్టి కావడం.. మరమ్మతులు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా మొత్తం బురదమయంగా మారుతుంది. మోకాళ్ల లోతు వరకు దిగబడుతుండటంతో ఎరువుల బస్తాలు, మందు డబ్బాలు మోసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఎడ్లబండ్లు కూడా బురదలో కూరుకుపోతున్నాయని.. ఉపాధిహామీ పథకంలో భాగంగా మట్టిరోడ్లు నిర్మించాలని వేడుకుంటున్నారు.

పట్టని నిబంధనలు..

మండలంలోని ఝరి(బి), మహలింగి, ఎల్విత్, భోసి, బామ్ని, ఉమ్రి(కే) గ్రామాల రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలని అప్పటి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఈజీఎస్ నిధులతో బండ్లబాటలకు మరమ్మతులు చేయించాలని ఆదేశాలు జారీ చేసినా.. అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఏళ్లుగా రైతులకు బురదరోడ్ల బాధలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పంటచేన్లకు వెళ్లే బురదరోడ్లకు మరమ్మతులు చేయించాలని వేడుకుంటున్నారు.

చందాలు వేసుకుని..

మండలంలోని మహలింగి, ఝరి(బి) గ్రామాల్లో రైతులు చందాలు వేసుకుని తమ పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్లు నిర్మించుకున్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో వ్యవసాయ భూములున్న రైతులు రూ.వెయ్యి చొప్పున జమ చేసుకొని బండ్లబాటలు నిర్మించుకున్నట్లు రైతులు తెలిపారు.

ఎడ్లబండ్లు వెళ్లడం కష్టంగా ఉంది



సరిహద్దు ప్రాంతంలో ఉన్న వ్యవసాయ భూములకు ఎడ్లబండ్లు కూడా వెళ్లడం కష్టంగా ఉంది. మొత్తం బురదమయంగా మారడంతో ఎరువుల బస్తాలను మోసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. పండించిన ధాన్యం తీసుకురావడం కష్టంగా ఉంది. అధికారులు స్పందించి బండ్లబాటలు నిర్మించి సమస్య పరిష్కరించాలి.

– లక్ష్మణ్‌పటేల్, హిప్నెల్లి

ఏటా కష్టాలు తప్పట్లేదు



ఏటా వర్షాకాలంలో భూములకు వెళ్లేందుకు రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. చిన్నపాటి వర్షాలకే బండ్లబాట మోకాల లోతు వరకు దిగబడుతోంది. అధికారులు స్పందించి బండ్లబాటలపై మొరం పోయించి రైతుల సమస్యలు పరిష్కరించాలి.

– వినాయక్, ఉమ్రి(కే)

ప్రతిపాదనలు పంపుతాం

మండలంలోని ఆయా గ్రామాల నుంచి రైతులు తమ పొలాలు, చేన్లకు వెళ్లేందుకు రోడ్లు లేనిమాట వాస్తవమే. ఆయా చోట్ల మట్టిరోడ్ల నిర్మాణం చేపట్టాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరవగానే పంటపొలాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం.

– లింగం మూర్తి, తహసీల్దార్

వ్యాధుల బారిన పడకుండా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

లోకేశ్వరం: ప్రజలు వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ కళా బృందం సభ్యుడు సురేందర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని కొత్త బస్టాండులో డెంగీ వ్యాధిపై కళాజాత నిర్వహించారు. ఈసందర్భంగా కళా బృందం సభ్యులు మాట్లాడుతూ సీజనల్ నిల్వనీటితో దోమలు వ్యాప్తి చెందే విధానం పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మరియా, భోజన్న ఉన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా 15 ఏళ్లు పని చేసిన భారతి ఇటీవల బదిలీపై లోకేశ్వరం మండలం కిష్టాపూర్ పాఠశాలకు వెళ్లారు. ఆదివారం కనకాపూర్‌లో ఉపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రవీణ్, మధు, ప్రశాంత్, సౌజన్య, సత్యవ్వ, శాయిని బేగం, ఎ.శ్రావణి, సోని తదితరులు ఉన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

అందుబాటులో ఎరువులు

ముధోల్: మండలంలోని బిద్రెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు అందుబాటులో యూరియా, ఎరువులు ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు. అష్ట, బాసర గోదాంలనందు డీఏపీ రూ.1350, 20:20:0:13 రూ.1100, యూరియా రూ.267, 12:32:16 రూ.1470, 15:15:15 రూ.1380 ఉన్నాయని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు ఆధార్ జిరాక్స్‌లతో కార్యాలయానికి రావాలని సూచించారు.

కడెంలో ‘హర్ ఘర్ తిరంగా’

కడెం: ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆదివారం కడెంలో బీజేపీ నాయకులు హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయంలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీని వాస్, నాయకులు రమణారెడ్డి, గంగాధర్, భీ మన్న, తిరుమల్, భూమన్న తదితరులున్నారు.

నిబంధనలు పాటించాలి



కుంటాలలో వాహన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై రజనీకాంత్

కుంటాల: వాహనదారులు విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై రజనీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం కుంటాల, కల్లూరు రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు విధిగా వాహనాల ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. వారి వెంట ఏఎస్సై దేవ్‌రావు తదితరులు ఉన్నారు.

‘హామీలు అమలు చేయండి’

భైంసాటౌన్: ఎన్నికల వేళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నాయని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి, న్యాయవాది జగన్మోహన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో మట్లాడారు. షరతులు లేకుండా రూ.2 లక్షల రుణం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాతరుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు.

సన్మానం

కుంటాల: కుంటాలకు చెందిన సబ్బిడి దేవేందర్ ఇటీవల వెలువడిన పీజీటీ (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్) ఫలితాల్లో బాసర జోన్‌లో రెండవ స్థానంలో నిలిచి పీడీ(ఫిజికల్ డైరెక్టర్)గా ఎంపికైన విషయం తెలిసిందే. ఇటీవల భైంసా ఎంజేపీలో పాఠశాల పీడీగా బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం మండలంలోని అందాకూర్‌లో ఆయనను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తపల్లి బుచ్చన్న, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్, కండక్టర్ గంగయ్య, సబ్బిడి గజేందర్ పాల్గొన్నారు.